


హుషారుగా లాడ్జికి వచ్చి కూనిరాగాలు తీస్తూ తలుపు తాళం తీసేసరికి ఆ కవరు కనిపించింది. 'ఎక్కడినుండై యుంటుంది?' అనుకుంటూ ముందు చిరునామా పరికించి చూశాను. 'ఆమే వ్రాసింది- ఓ! చాలాకాలానికి జ్ఞాపకం వచ్చానే!" అనుకున్నాను.

కవరు చించి ఉత్తరం మడత విప్పేలోపున ఐదారుసార్లు ఊపిరి తీసి ఉంటాను. బహుశా నాడి వేగం హెచ్చి ఉంటుంది. ఒంట్లోకి కొత్త రక్తం ప్రవహించినట్లు ఏదో వేడి నరాల్లోకి ప్రవహిస్తూంది. ఉత్తరం విప్పి అదుర్దాగా ఆశగా అమాయికంగా చదివాను. రెండువంతులు చదివే వరకూ నేనేం చదువుతున్నానో తెలియని ఆవేశంలో ఉన్నాను. అప్పుడు తెలిసింది, నేను చదువుతున్నది మరొక్కసారి చదివితేగాని అన్వయించుకో లేనని. మంచంమీద కూలబడుతూ మళ్ళీ మొదటి నుండీ చదివాను. క్రమక్రమంగా వేడి తగ్గింది. నాడి సన్నగిల్లింది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు దీర్ఘములై నిట్టూర్పులుగా పరిణమించాయి. కిటికీలోనుంచి సముద్రపుగాలి వీస్తూనే ఉన్నా వళ్ళంతా చిరు చెమటలు పోసింది. కూర్చున్నవాణ్ణి అలాగే పక్క మీద వత్తిగిలాను. అర్థనిమీలిత నేత్రాలతో ఒకసారి ఉత్తరం వంకా మరొకసారి కిటికీలోనించి వెలుగులను పోగొట్టుకొని చీకటిని తనలో చేర్చుకుంటున్న ఆకాశంవంకా చూశాను. క్షణమాత్రం కళ్ళుమూసుకుని మళ్ళీ లేచి కూజాలోని గ్లాసుడు నీళ్ళు తాగేశాను. అప్పటికి కాస్త స్తిమితపడ్డాను. తిరిగి మరొకసారి నిదానంగా ఉత్తరాన్ని చదివాను. ఉత్తరం అంతా కలిపి అయిదారు వాక్యాలకు మించి లేదు. కాని ఆ చిన్న వాక్యం వెనుక ఏదో నిగూఢమైన భావం ఉండి ఉంటుంది. దాన్ని నేను వెలికి పట్టుకోవాలి అనే పట్టుదలతో ఓర్పుగా చదివాను. కొంతమట్టుకు అర్థమైనట్లే అయింది. అసలు నాకలా అర్థమవాలనే ఆమె అలా వ్రాసుంటుంది అనుకున్నాను.

ఇందులో ఏదో ప్రమాదం ఉంది. ఆమె ఎంత బాధపడుతూ వ్రాసిందో ఈ ఉత్తరాన్ని. ఇంకా స్పష్టంగా వ్రాయకూడదూ! ఎందుకిలాంటి నిశ్చయానికి వచ్చిందో; ఆమెను బలవంతంగా ఈ స్థితికి లాక్కువచ్చిన పరిస్థితులు ఏవో ఉండి ఉంటాయి. కాని ఏమిటీ పిచ్చిపిల్ల. ఇంత ఆలశ్యంగా వ్రాయకపోతే కాస్త ముందుగా వ్రాయకూడదూ; పూర్తిగా తనకు తానై పరిస్థితులకు లొంగిపోయి జీవితాన్ని నాశనం చేసికోకపోతే నా సహాయాన్ని నా సల

పోను తీసికొని పరిస్థితులను ఎదుర్కోరాదూ? ఈ మధ్య నేను రెండు ఉత్తరాలు వ్రాసినా జవాబు వ్రాయలేదెందుచేతనో అనుకున్నాను. ఈ చిక్కులలో పడి కొట్టుకుంటూంది కాబోలు.

ఐనా నాదే తప్పు. నేను ఉత్తరాలకి జవాబు వ్రాయలేదే అని ఇక్కడే కూర్చున్నాను. మొన్న వారంరోజులు దసరా సెలవులు వచ్చాయి గదా ఒకసారి వెళ్ళి ఉంటే బాగుండేదేమో! ఆవిడను ఈ ప్రమాదంనుండి తప్పించి ఉందును అనుకున్నాను.

ఆలోచల పరంపరలనుండి తెప్పరిల్లి టైముచూసే సరికి తొమ్మిదిగంటలయింది. అరే చాలా టైమయింది. ఊరికనే ఆలోచిస్తూ కూర్చుని ఏం లాభం. ఇంకా నాలుగురోజులు టైముంది. ఇప్పుడైనా వెళ్ళి సంగతేమిటో కనుక్కొని సాధ్యమైనంతవరకూ ఆమెనీ పరిస్థితినుండి తప్పించాలి. ఐనా అంతా సిద్ధమయాక ఇప్పుడింక నేను వెళ్ళి చేసేదేముంది?

"వీలయినంత ముందుగా వస్తే సంతోషిస్తాను" అని వ్రాసింది. రాత్రి పదిగంటలకొక పాసింజరు బండి ఉంది. దీనిలోపోతే రేపు సాయంత్రానికయినా గుంటూరు చేరుకో వచ్చును అనుకొని గబగబా రెండు జతల బట్టలు తీసి హోల్డాలులో సర్ది గదికి తాళంవేసి బయలుదేరాను. తోవలో పోస్టు డబ్బాలో కాలేజీకి ఒక సెలవు దరఖాస్తు పడేసి జనతా హోటలులో ఒక కప్పు వేడిపాలు తాగి రిక్షాయెక్కి స్టేషనుకు చేరుకున్నాను.

"బండి రెండు గంటలు లేటు" అన్నాడు. "వెధవబండ్లు ఎప్పుడూ లేటే. అవును లేటుకాక ఏమవుతుంది? రేవతి నాకు ఉత్తరం వ్రాయటం లేటు— రేవతి దగ్గరకు నేనువెళ్ళటం లేటు, అంతా లేటు వ్యవహారం." చికాకుగా ప్లాటుఫారంమీద ఈ చివరి నుండి ఆ చివరి వరకూ తిరిగాను. మనస్సు కూడా యీ చివరినుండి ఆ చివరివరకూ ఆలోచనలను అనుభవాలను కలిపి నెమరు వేస్తూంది.

రేవతికీ నాకూ పరిచయమై రెండు సంవత్సరాలు పైనయింది. నేను ఆనర్సు ప్యాసయిన రెండు నెలలకే కాలేజీలో తెలుగు లెక్చరరుగా చేరటం జరిగింది. అప్పుడు రేవతి బి. ఏ. జూనియర్ చదువుతూంది. రేవతి చాలా తెలివైన పిల్ల, తెలుగులో వ్యాసాలు కథలూ వ్రాస్తూండేది కూడా.

కాలేజీ ప్రాచ్యభాషాసమితికి ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరిని కార్యదర్శిగా ఎన్నుకుంటారు. ఆ సంవత్సరం నన్ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆ ఏడు డిసెంబరులో మా సమితి తరఫున ఒక పత్రిక వెలువడవలసి ఉంది. దానికి నా విద్యార్థులలో కొందరిని ప్రత్యేకం వ్యాసాలు వ్రాయమని నేను ప్రోత్సహించాను. అందులో రేవతి ఒకతె. భారతంలో ఒక ఘట్టం గురించి వ్యాసం వ్రాయమని నేనే ఆమెకు చెప్పాను.

సీతాపతి కూడా నా విద్యార్థే. అతను ఒక మాదిరిగా కవిత్వం వ్రాయగలడు. అతడుకూడా పనికి వచ్చేవాడే. నా కిష్టుడు. సీతాపతీ రేవతీ ఇంటర్మీడియేట్ నుండీ సహపాఠులు, స్నేహితులు. ఒకనాడు సీతాపతివచ్చి నాతో చెప్పాడు. 'ఆమెకు మీరిచ్చిన సబ్జెక్టు విషయంలో ఏవో సందేహాలున్నాయట. మిమ్మల్నడగాలనుకుంటూంది. మేమిద్దరం కలసి మీ లాడ్జికి వస్తాము. ఎప్పుడు రమ్మన్నారు?' అని. ఆదివారం సాయంత్రం రమ్మన్నాను.

ఆదివారం వాళ్ళిద్దరూ వచ్చారు. చాలా విషయాలు మాట్లాడేము. అదే మొదలు ఆమెతో ఒక రకమైన పరిచయం అవటానికి. తరువాత చాలా సార్లు మేము ముగ్గురమూ అనేక సాహిత్య విషయాలు చర్చిస్తూండటం జరిగేది. ముగ్గురమూ బీచిలో కూర్చునేవాళ్ళం—లేదా మా లాడ్జిలో— ఆమె నన్ను 'మేష్టారూ' అని పిల్చేది. నే నామెను పేరుపెట్టి పిల్చేవాడిని-కాని 'మీరు' అనేవాడిని.

సంక్రాంతినాడు-ఆమె ఒక చీటీవ్రాసి ఒక చిన్నబ్బాయికిచ్చి పంపింది, ఆ సాయంత్రం నన్ను వాళ్ళ యింటికి టీకి రమ్మని ఆహ్వానిస్తూ. నేను కొంచెం ఆలశ్యంగా వెళ్ళాను. వాళ్ళిల్లుకూడా బీచి ఒడ్డునే ఉంది.

ఆమె నా కోసం ఎదురు చూస్తూంది.

"ఇంత ఆలశ్యం చేశారేం?" అన్నది.

"సీతాపతి నా లాడ్జికి వస్తాడేమోనని చూశాను. కాని రాలేదు. ఇక్కడికీ రాలేదా?" అన్నాను.

"అసలు ఊళ్ళో లేడు. పండగ కదా! అత్తవారింటికి వెళ్ళకుండా ఉంటాడా?" అన్నదామె.

సీతాపతికి చిన్నప్పుడే పెళ్ళయిందట. నా కదొక కొత్త విషయం తెలిసింది. నేనిన్నాళ్లూ రేవతిని సీతాపతిని గురించి ఒక విధంగా ఊహించాను. కాని అది నిజం కాదన్నమాట. వాళ్లు కేవలం స్నేహితులే.

ఆమె నాకు కాఫీ టిఫిన్లు యిచ్చింది. మాటల సందర్భంలో వాళ్ళ నాన్నగారు రిటైర్డు డిప్యూటీ కలెక్టరనీ తల్లి చిన్నప్పుడే చనిపోయిందనీ తా నొక్కతే సంతానమనీ చెప్పింది. ఆమె చదువు కొరకే వాళ్ళ నాన్నగారు వచ్చి విశాఖపట్నంలో కాపురం పెట్టారుట.

తరువాత రోజులు చకచకా నడిచిపోయాయి. ఆమెకు నాయందొకరకమైన అభిమానం. నా కామెయందొక రకమైన ఆకర్షణ. నేను తరుచూ వాళ్ళింటికి వెళ్ళేవాడిని. వాళ్ళ నాన్నగారు సాయంత్రం షికారుకు వెళ్ళేవారు. ఇంట్లో ఒక వంట ముసలమ్మా పనిచేసే కుర్రాడూ ఉండేవారు. మేము స్వేచ్ఛగా మాట్లాడుకునేవాళ్ళం. క్లాసులో పాఠాలు మొదలు ప్రపంచంలోని అనేక సంగతులు మాకు గంటల తరబడి మాట్లాడడానికి విషయాన్ని సమకూర్చేవి. సీతాపతి అప్పుడప్పుడు మాతో కలిసేవాడు. ఆమెతో నా పరిచయము వృద్ధి అయిన పిమ్మట అతడు తన రాకపోకలు కొంత తగ్గించినట్లయింది. కాని వచ్చినప్పుడల్లా మాతో కలసిమెలసి ఉండేవాడు. సరదా అయిన మనిషి.

రేవతి నాన్నగారు కూడా అప్పుడప్పుడు యింట్లోనే ఉండి మా కబుర్లతో కబుర్లు కలిపి కాలక్షేపం చేసేవారు.

బెల్లు గణగణమంది. పాతసంగతులు నెమరువేసు కొనటంలో మునిగిఉన్న వాడిని తుళ్ళిపడ్డాను. ప్లాటుఫారం చివరివరకు వచ్చాకానేమో త్వర త్వరగా ముందుకు వెళ్ళాను. ఇంతాచేస్తే ఆ వచ్చేది పాసింజరు కాదు గూడ్సుబండి.

ముబ్బు నేసింది. చిన్న తుంపరలుగా వాన పడు తున్నది. అయినా బాగా ఉడకగానే ఉంది. హృదయంలో ఆవేదన. కడుపులో ఆకలి కష్టా పాలతో చల్లారలేదు. పాలంటే జ్ఞాపకం వచ్చింది. నాకసలు పాలంటే యిష్టంలేదు. కాని రేవతి యింటికి వెళ్ళినపుడల్లా పాలు తెచ్చియిచ్చేది. ఈ శిక్ష ఏమిటనేవాడిని నేను. కాఫీ ఎక్కువసార్లు తాగితే ఒళ్లు పాడవుతుందనేదామె. ఆవిడవన్నీ చిత్రమైన సిద్ధాంతాలు. కాఫీ రోజుకు రెండు సార్లు కంటె తాగకూడదట. సిగరెట్టు అసలు ముట్టనే కూడదట.

అసలామెకూ నాకూ సాధారణంగా వివాదమే వచ్చేదికాదు, ఈ చిన్న విషయంలోతప్ప. నేను సిగరెట్టు కాల్చినప్పుడల్లా ఆమె నాతో పోట్లాడేది. ఆమెతో పరిచయం వృద్ధి అయినకొద్దీ ఆమె ముందు సిగరెట్లు కాల్చటం అంటే భయం పట్టుకుంది. అలాగని మానుకున్నానా అంటే అదీలేదు.

ప్లాటుఫారంమీద ఎన్ని సార్లు తిరిగానో లెక్క లేదు. కాల్చి పారవేసిన సిగరెట్టు ముక్కలు నేనెంత మేర తిరిగానో ఆనవాళ్లు చూపిస్తున్నాయి. ఎలాగయితేనేం రైలు వచ్చింది. ఇంక ఫరవాలేదు అనుకుని శరీరాన్నందులో చేరవేశాను. రైలు వాల్తేరుదాటి ముందుకు ముందుకు సాగిపోతూంది. బండిలో జనం అంత ఎక్కువగాలేరు. కాస్త జాగా చూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించాను. భోజనం చేయకపోవడం వల్లనేమో కడుపులో అదోలా ఉంది. నిద్రపట్టలేదు...'దువ్వాడ'... 'తాడి'... రైలుబండి అక్కడక్కడ ఆగుతూ మళ్ళీ పరుగెడుతూంది. కాని ఆలోచనల బండికి స్టేషన్లులేవు. ఒకదాని నొకటి కలుపుకుంటూ ఎక్కడికో సాగిపోతున్నాయి.

రేవతీ నేనూ కాలేజీలో ఎప్పుడూ మాట్లాడే వాళ్ళంకాము కాని చాలామందికి తెలుసు నేను వాళ్ళింటికి తరచు వెళతానని. మేమిద్దరం బీచిలో తిరుగుతూంటామని. అనేక విధాల చెప్పుకోవటం కూడా పరిపాటి. అందుకు మేమెక్కువ బాధ పడలేదు.

నాకు తెలియకుండానే నేను రేవతిని నువ్వని పిలవటం ప్రారంభించాను. ఆమె అభ్యంతరం చెప్ప లేదు. ఆమె నన్ను 'మాష్టారూ' అని పిల్చేది. నే నామెనలా పిలువవద్దన్నాను. మరేమని పిలవా లన్నది. నా పేరుపెట్టి పిలువు, నాకదే బాగుంటుంది" అన్నాను. అప్పటినుండీ ఆమె నన్ను 'శాస్త్రిగారూ' అనటం మొదలుపెట్టింది.

ఇంతలో మరొక విశేషం జరిగింది. బి. ఏ. రెండవ సంవత్సరంలోకి వచ్చేసరికి రేవతికి మరొక స్నేహితుడు లభించాడు. అతను కృష్ణమూర్తిం

కొత్తగా బి. ఏ.లో చేరాడు. రేవతి కెక్కడో దూరపు బంధువట. వాళ్ళింట్లోనే వీధిలోవున్న ఒక గది తీసికొని ఉన్నాడు.

కృష్ణమూర్తి పచ్చగా సన్నగా పొడుపుగా పాలతొటాకు బొమ్మలా ఉంటాడు. అతనిలో ఆడపిల్లమాదిరి నాజూకుతనం ఉంది. హాయిగా పాడతాడు. అతడు మాట్లాడుతుంటే కూడా పాట పాడినట్లుండేది. ఎవ్వరినైనా యిట్టే ఆకర్షించగల స్వభావం ఉందతనిలో. అతనంటే నాకేమీ కోపంలేదు కాని రేవతి కతడు స్నేహితుడయిపోవటం నాకు కొంచెం కష్టం కలిగించింది. దానికి కారణం నా స్వార్థం.

మనస్సు సంవత్సరం క్రితం పరిచయాలనూ పరిస్థితులనూ కలగలుపుచేసి కథల్లల్లుతూంది. చేతిలో సిగరెట్టు చేతిలోనే కాలిపోయింది. చెయ్యి చురుకే వరకూ నేను జాగ్రదావస్థలో లేను. ఆ సిగరెట్టు ఆఖరిసారిగా ఒక్కసారి ఊదిపారేసి కొత్త సిగరెట్టు ముట్టించేసరికి ఉత్తరం మరొక్కసారి చదవాలనిపించింది. తీసి చదివాను:

"ప్రియమైన శాస్త్రిగారికి: నమస్కారములు. నేను చాలాకాలంనుండి జవాబు వ్రాయనందుకు మీకు కోపంగా ఉండిఉంటుంది. ఎప్పటికప్పుడే వ్రాయాలనుకుంటూ వ్రాయలేక పోయాను. క్షమించమని ప్రార్థన.

నాకు ఈనెల 26వ తేదీన ఉదయం 9-10ని.లకు వివాహం జరుగుటకు నిశ్చయమైనది. వరుడు డాక్టరు వేణుగోపాలరావు. వివాహం హఠాత్తుగా నిశ్చయమైనది. ఇంతకంటె ముందుగా వ్రాయటానికి కవకాశం లేకపోయింది.

మీరు తప్పకుండా రావాలి. మీకు తెలుసు, మీరు రాకపోతే నేనెంత బాధపడుతానో. మీకు నిజంగా నాయందు దయ ఉంటే తప్పక రండి. మీరెంత ముందుగా వస్తే అంత సంతోషిస్తాను. ఆహ్వాన పత్రిక బుక్ పోస్టులో వస్తుంది.

—రేవతి."

ఉత్తరం మడిచి జేబులో పెట్టాను. ఎంత నిర్వికారంగా వ్రాసింది!—అనుకున్నాను. ఆమె చాలా బాధపడుతూండి ఉంటుంది. దానిని వ్యక్తం చేసి మాత్ర మేమి లాభం అని వ్రాయలేదేమో! ఐనా వ్యక్తం అవుతూనే ఉంది.

'మీకు నిజంగా నాయందు దయ ఉంటే' ఆ మాటలు నా మనస్సులో బరువుగా మెదిలాయి. ఎంత వినయంగా వ్రాసింది!

ఇంతకీ రేవతికి నాయం దెలాంటి అభిప్రాయ మున్నదో? ఆమెకు నాయందెలాంటి అభిప్రాయం ఉందో ఎప్పుడూ స్పష్టంగా చెప్పలేదు కాని నా అభిప్రాయాలతో ఆమె ఎప్పుడూ ఏకీభవించేది. ఆమెకు తెలియని ఏ విషయం గురించి నేను చెప్పినా విశ్వసించేది. ఆమెకు నాయందొక భక్తి, అభిమానము, గౌరవం ఉన్నాయని ఆమె పరిచయంతో స్పష్టంగా తెలిసింది నాకు. 'మరి నన్ను ప్రేమిస్తున్నదా?' ఈ విషయం అప్పుడప్పుడు నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. కాని సరియైన జవాబు దొరకలేదు.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అలాంటి మాటలు కృతకంగా తోస్తాయి నాకు, అదేదో సినిమా వ్యవహారంలా ఉంటుంది. ప్రేమనేది ఒక వ్యక్తిపట్ల అనురాగం. ఆ అనురాగంతో కూడుకున్న మరికొన్ని భావాలు, ఆశలు, ఉద్రేకముల కలయిక. అవి వాటంతటవే కలగాలి. వాటంతటవే వ్యక్తమవాలి. వాటంతటవే రూపొందాలి. అప్పుడు రావలసిన ఫలితాలు రానే వస్తాయి అనుకునే మతం నాది.

అందుచేతనే ఆమెతో నాకెంత పరిచయం ఉన్నా ఈ ప్రసక్తి ఎన్నడూరాలేదు. నేననుకునే వాణ్ణి-ఆమెకు నాపట్ల ప్రేమ ఉంది అని. నాకామెయందెలాంటి అభిప్రాయం ఉందో ఆమెకు తెలిసే ఉంటుంది అని నా విశ్వాసం. మొదట్లో ఆమె తెలివితేటలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. తరువాత ఆమె పరిచయం నాకు ఆసక్తి కొల్పింది. క్రమంగా ఆమెతోడి చనువు నాలో ఉత్సాహం తెచ్చింది. చివరకు ఆమె అందమయినది అనే అభిప్రాయం నాలో కోరికలు నిలిపింది. ఎప్పటికయినా ఆమెను నేను పొందగల్గుతానను కున్నాను. కాని ఆవిషయమై నేను తొందరపడలేదు. బహుశా అదే నేను చేసిన పొరపాటేమో!

నా ఆశలకి కృష్ణమూర్తి అప్పుడప్పు డడ్డుతగిలేవాడు. రేవతికి కృష్ణమూర్తి నాకంటే తక్కువ కాలంలో ఎక్కువ సన్నిహితుడయాడనిపిస్తుంది. దానికి చాలా కారణాలు కలిసొచ్చాయి. వాళ్లి

ద్దరూ ఒక్కయీడువాళ్ళు. దూరపు బంధువులు. అతడు వాళ్ళింట్లోనే మకాం వేశాడు. పైగా ఆమెకు అతను జూనియర్. సహజంగా వాళ్ళిద్దరూ ఎక్కువ చనువుగా వుండటానికి అవకాశాలు ఏర్పడ్డాయి.

కాని అతని పరిచయంవలన ఆమెలో మార్పేమీ రాలేదు. ఎప్పటిలాగే పలుకరించేది. ఎప్పటి ఆప్యాయముతోనే చూసేది. ఎప్పటి చనువుతోనేమాట్లాడేది. మేమందరంకలిసి మాట్లాడుకునేటప్పుడు తెలిసింది, కృష్ణమూర్తికీ ఆమెకూ ఏ విషయంలోనూ ఏకాభిప్రాయంలేదు. ఎప్పుడూ వాదించుకునేవారు. కాని ఆ వాదనలో కోపం లేదు. ఉద్రేకంలేదు. కేవలం మాటకు మాట చెల్లించుకునేవారు. వాళ్ళిద్దరూ వాదించుకుంటూంటే వినటానికెంతో యింపుగాఉండేది. ఆమె అతనిని ముద్దుగా 'కృష్ణా' అని పిల్చేది. 'నువ్వు' అనేది.

ఇంత చనవు వాళ్ళిద్దరిమధ్యా ఉన్నా కృష్ణమూర్తి నామె ప్రేమిస్తున్నట్లు నాకు తోచలేదు. కాని అతని విషయంలో నాకనుమానమే.

అతనామె వదోలా చూసేవాడు. ఆమెనవ్వితే ఆమె మాట్లాడితే ఆదోకరకమైన ఆనందం అతనిలో కన్పించేది. ఆతడు చూసేచూపు, అతని ఆనందపు లోతు, నాకు బాగా అనుభవమే. నేను కూడా అదేస్థితిలో ఉండడంచేత!

అతడు నావిషయం గమనించకపోలేదు. ఆమె వదోలా చూస్తూ ఒక్కొక్కసారి నావైపు బెరుకుగా చూసేవాడు. అదేసమయంలో నేను అతనిని చురుకుగా చూసేవాడిని. మా యిద్దరి చూపులు పోటీపడి ఆమెవైపు మళ్ళేవి. ఆమె ఈ చూపులను వేటినీ గమనించని ధోరణిలో మాట్లాడేస్తూండేది.

ఒక్కొక్కప్పుడు నాకు చికాకుగా ఉండేది. ఇద్దరినీ యిలా గాలంపట్టి లాగినట్లు తనవైపు లాగుకుని ఆశతో చంపకపోతే ఏదో ఒకటి తేల్చి చెప్పేయరాదూ అని. మళ్ళీ సమాధాన పర్చుకున్నాను. ఆమెకుమాత్రం సమయంరాదూ ఒక నిశ్చయానికి రావటానికి అని. ఆ నిశ్చయం ఎప్పటికైనా నావైపే మొగ్గుతుందని ఒక ధైర్యం లేకపోలేదు.

కిటికీలోనుండి ఎండ ముఖంపై పడేదాకా తెలివి రాలేదు. రాత్రి ఎప్పుడు నిద్రపట్టిందో గుర్తులేదు. లేచి టైముచూస్తే ఏడుగంటలయింది. బండి నిడదవోలు స్టేషను చేరింది. స్టేషనులోకి వెళ్ళి ముఖం కడుగుకుని కాఫీ టిఫిను తీసికొని వస్తున్నాను. "నమస్కారం మాష్టారూ" అన్నాడు కృష్ణమూర్తి నా ప్రక్కనుండి వచ్చి.

"అరే! నువ్వటోయి! అన్నట్లు మీ దీ ఊరే కదూ, ఎక్కడిదాకా ప్రయాణం!" అన్నాను.

"గుంటూరే!" అన్నాడు నేను గుంటూరే వెళ్తున్నానని ముందే అర్థం చేసుకొని.

"నీకుత్తరం వ్రాసిందా!" అన్నాను మరేమడగాలో తోచక. "ఇదుగో చూడండి!" అన్నాడు ఉత్తరంతీసి నాకిస్తూ. అతను ఉత్తరం నాచేతికిస్తాడనుకోలేదు నేను. ఉత్తరం అందుకుంటూనే "ఏం వ్రాసిందో చెప్పు!" అన్నాను. "చదవండి!" అన్నాడతడు.

ఉత్తరంలో అంతా నాకు వ్రాసిన వాక్యాలే వ్రాసింది. "నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తూంటే తప్పకుండా రావాలి సుమా!" అని ముగించింది. 'నువ్వు' అనటంలోని మరింత దగ్గరతనం, "ప్రేమిస్తూంటే!" అన్న మాటలోని ఒక ప్రత్యేకార్థం తప్ప అందులో కొత్తదనం లేదు. ఇద్దరికీ ఒకేల్లాగ వ్రాయటం నాకు కష్టమనిపించింది. కాని ఆమె తప్పేమీ లేదు. ఆమెకిప్పుడు ఇద్దరం ఒక్కదూరంలోనే ఉండిపోయాము.

ఇద్దరమూ బండిలోకెక్కాము. కృష్ణమూర్తి చాలా నీరసంగా కన్పిస్తున్నాడు. అతను చాలా చిన్నబుచ్చుకున్నట్లున్నాడు రేవతి ఉత్తరంతో. నాతో ఎప్పుడూ మాట్లాడనివాడు చనువుగా మాట్లాడటం మొదలు పెట్టాడు, అతనిలోని బరువునంతటినీ మాటలతో నాకు వ్యక్తం చేయటానికా అన్నట్లు. రేవతి ఉత్తరం నాకంటె అతనిని ఎక్కువ కష్టపెట్టింది. అత డాడపిల్లలా బాధ పడుతున్నాడు. ఆ మధ్య వేసవి సెలవులలో ఆమె చాలా ఉత్తరాలు వ్రాసిందట, ఆమె కేమీ తోచటం లేదనీ, తనను రమ్మనమనీ, కొద్దిరోజులు వాళ్ళింట్లో ఉండి వెళ్ళమనీ పదేపదే వ్రాసిందట. మరొకసారి 'నీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి ఒక్కసారి రమ్మన'మని వ్రాసిందట.

కాని కృష్ణమూర్తి వాళ్ళనాన్నగారికి సుస్తీగా ఉండటంచేత వెళ్ళలేక పోయాడట.

"ఇన్ని ఉత్తరాలు వ్రాసింది. కాని తన వివాహం విషయం మాట చూచాయగానైనా వ్రాయలేదు. తను రమ్మనగానే నేను వెళ్ళలేదని కోపంవచ్చి మనస్సు మార్చుకుందేమో!" అన్నాడు.

"అంత చిన్న విషయానికి మనస్సు మారిపోతుందటోయ్! హఠాత్తుగా నిశ్చయమైనదని వ్రాసిందిగా! ఏదో విపరీతం జరిగి ఉంటుంది" అన్నాను.

"మీరుకూడా బాధపడి ఉంటారు ఆమె ఉత్తరం చూసి. కొన్నాళ్లు నేననుకునేవాణ్ణి ఆమె మిమ్మల్నే వివాహం చేసుకుంటుందేమోనని. కాని తరువాత తెలిసింది నేను పొరపాటుపడ్డానని, ఆమెకు మీయందు భక్తి అభిమానం మాత్రం ఉన్నాయి. ఇప్పుడనుకుంటున్నాను-నా విషయంలో ఆ అభిమానం మాత్రమే ఉంది కాబోలని."

నేనేమీ జవాబు చెప్పలేదు. కాని నా ఊహాలు మారుతున్నాయి. కృష్ణమూర్తి భావాలర్థం చేసికున్నాక నేననుకున్నాను, బహుశా ఆమె మా యిద్దరిలో ఎవరికీ మేమనుకున్నరీతిగా ప్రేమించి ఉండదని. కాని నేనొక నిశ్చయానికొచ్చాను. వెళ్ళగానే ఆమెను కలుసుకోవాలి అసలు విషయం స్పష్టంగా తెలుసుకోవాలి అని.

ఇంతవరకూ వచ్చాక ఆమె నాకు కాకుండా పోయిందే అని విచారిస్తూ కూర్చుని ప్రయోజనం లేదు. కాని ఆమె ఈ హఠాన్నిశ్చయం ఒకరకమైన బలవంతపు పెండ్లి కాదు కదా! చదువుకున్నది తెలివైనది. అలా లొంగిపోతుందా? ఏమో! వాళ్ళ నాన్నగారేమైనా మొహమాట పెట్టారేమో.

ఆలోచించిన కొద్దీ ఈ పరిణామానికి మేము కూడా కొంత కారణమే నేమో అని నేరస్థుని మాదిరి బాధపడ్డాను. నేనుగాని కృష్ణమూర్తిగాని ఒక స్పష్టమైన అభిప్రాయాన్ని ఆమె కీయలేక పోయామేమో. అందుచేతనే ఆమె ఈ నిశ్చయాని కొచ్చినదేమో అనిపించింది. ఆమె ఎవరిని ప్రేమించినా అది నా కనవసరం. కాని ఆమె యిష్టపడిన వానిని పెండ్లిచేసుకుని సుఖిస్తే అంతేచాలు. నేను పోయి ఆమె వ్యథిత హృదయానికి ఊరట గల్గించగల్గితే ఆమె నా యందు చూపే ఆదరణకు ప్రతిఫలం యిచ్చిన వాణ్ణవుతాను అనుకున్నాను.

ఈ నిశ్చయానికొచ్చాక మనస్సులో ఆరాటం తగ్గింది. ఏలూరులో వీక్లీ ఒకటి కొన్నాను. ఆ వారపత్రిక చదువుతూంటే నాకొక విషయం గుర్తుకొచ్చింది.

ఒకసారి సీతాపతి ఏదో వారపత్రిక చదువుతూ రేవతితో అన్నాడు 'ఇందులో మంచి సైకలాజికల్ స్టోరీ ఒకటి ఉంది చదువు' అని.

"ఏమిటి విశేషం" అన్నది రేవతి.

"ప్రేమ వివాహం చేసికొన్నవారి వింత తత్వాలెలా ఉంటాయో చక్కగా చిత్రించాడీ కథలో!"

"పోనీలే నీకా బాధ ఏమీ లేదుకదా!" అన్నది రేవతి అతనివైపు చురుకుగా చూసి.

"నాకు కాదులే: నీకోసమే చదవమంటున్నాను. హఠాత్తుగా ఎవరిని ప్రేమించేస్తావో!"

రేవతి ఎందుకో దిగ్గునలేచి చరచరా వెళ్ళిపోయింది. ఆమె ముఖంలో ఆనాడు చిత్రమైన మార్పు చూశాను. సీతాపతి తెల్లబోయాడామె వైపు చూసి. నేనాశ్చర్యపోయాను. రేవతి సాధారణంగా చిన్నచిన్న విషయాలకు చలించేరకం కాదు. ఆ మాత్రపుటిమాత్రపు పరిహాసాలకు లొంగిపోయే రకంకాదు. మరి సీతాపతి అన్న మాటలు ఆమెనెందుకు కష్టపెట్టినై?

ఆ దినం నా ఆలోచనలు పరిపరివిధాల పోయినవి. ఆమె ఎవరినైనా ప్రేమించి విఫలత చెందినదా! అలాంటి నిదర్శనం ఏమీ లేదే! సీతాపతి ఆ మాట అనగానే అంత మాడ్చుకుందేం! సీతాపతి ఏమైనా అన్యాయం చేశాడా? ఆనాటి ఆమె ప్రవర్తనను గురించి ఎన్నోసార్లు ఆమె నడగాలనుకున్నాను. కాని అడగలేక పోయాను.

ఆనాటి ఆమె ప్రవర్తనకీ యీ పెళ్ళికీ ఏమైనా సంబంధం ఉన్నదా? ఏమో! నా కెక్కడా ఆధారం దొరకలేదు.

బెజవాడ చేరేసరికి మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. గుంటూరుపోయే ట్రెయిను నాలుగున్నరవరకూ లేదట. 'భోజనంచేసివద్దాం పదవోయి' అన్నాను కృష్ణమూర్తితో. 'నాకాకలి కాలేదండీ' అన్నాడు. బలవంతంచేసి తీసికొని వెళ్ళాను. ఏదో తిన్నాననిపించుకున్నాడతను. నేను మామూలుగా

భోజనం చేశాను. కొంచెంసేపు వెయిటింగు రూములో కూర్చునాం.

ఇంతలో జ్ఞాపకం వచ్చింది. "సీతాపతి బెజవాడలో ఉద్యోగం చేస్తున్నాడు కదూ?" అన్నాను.

"ప్రజాపత్రిక ఆఫీసులో చేరాడట" అన్నాడతను. "పోయి చూసి వద్దాంరా, అతనుకూడా వస్తాడేమో లాక్కురావచ్చు. ఇక్కడూరికనే కూర్చుని ఏం చేయాలి" అన్నాను.

ఇద్దరం బెడ్డింగులు క్లోకురూములో వేసి ఊళ్లోకి బయలుదేరాం. అతని ఉనికి తెలుసుకునే సరికి చచ్చినంత పనయింది. ఎండలో తిరిగి తిరిగి రెండు గంటలకు చేరుకున్నాం. అతను లాడ్జిలోనే ఉన్నాడు.

మమ్మల్ని చూసి బ్రహ్మానంద భరితుడైనాడు. "గుంటూరు కేనా? పెళ్ళి వారి కంటేముందే బయలుదేరారే! పెళ్ళివారిదీ ఊరే. రేపు బయలుదేరుతారట. మీ యిద్దరూ ఎలా కలిశారు?" ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. మనిషి మంచి హుషారుగా ఉన్నాడు. అతనికేం మూలాగ బాధపడవలసిన అవసరం లేదు కదా!

"నిన్నుకూడా తీసుకుని వెళదామని వచ్చాం. బయలుదేరు" అన్నాను సిగరెట్టు ముట్టిస్తూ.

"బాగుబాగు మీకు బోలెడు సెలవులు. కృష్ణమూర్తికి పనీపాటూ. లేదాయె. మీకేం మూడు రోజులు కాకపోతే మున్నై రోజులు ముందైనా బయలుదేరుతారు. పెళ్ళి పెత్తనమంతా చేయనూ గలరు. నాకెలా సాగుతుంది. ఉద్యోగంలో దిగాను కద!" అన్నాడు.

"పెద్ద ఉద్యోగం చేస్తున్నావు లేవోయి ఒక సెలవుచీటి పారేసి బయలుదేరక" అన్నాను నేను.

"ఆ అవకాశం ఉంటే తప్పకుండా అలానే చేద్దును. సరదాగా తిరిగిరావటానికి నాకుమాత్రం చేదా-కాని మొన్న మొన్ననుచేరి అప్పుడే సెలవు పెడితే ఏంబాగుంటుంది. అసలు ఆమె నాబోటి వాళ్ళకు సుళువుగా ఉంటుందని ఏ ఆదివారమో పెట్టుకోక శుక్రవారం పెట్టుకుంది ఆముహూర్తం. పోనీ రాత్రి లగ్నమయితే యిక్కడున్న గుంటూరే కనుక సెలవు పెట్టకుండానే వెళ్ళిరావచ్చునను కున్నాను. పగటి లగ్నమట. ఒకదినం సెలవు పెట్టక ఎలాగూ తప్పదు." అన్నాడు.

మాకు కాఫీ తెప్పించి యిచ్చాడు. "మరయితే మాకు టైమయింది. మేము వెళతాం." అన్నాను.

"అప్పుడే! ఏమిటోయి తమ్ముడూ అలా మౌన వ్రతం పట్టినట్లు కూర్చున్నావు! పెళ్ళికెళుతూ అంత దిగులుపడి కూర్చుంటే ఎలాగ? అందులో అడపెళ్లి వారు చలాకీగా ఉండకపోతే అవతల వాళ్ళకి లోకువైపోతాం" అన్నాడు కృష్ణమూర్తి భుజం మీద తడుతూ.

కృష్ణమూర్తి తెచ్చిపెట్టుకుని ఒకనవ్వునవ్వాడు సీతాపతి బాధపడలేక. సీతాపతి పట్టి గాలివాటు మనిషి. ఏమీ మనస్సుకు పట్టించుకోడు సరికదా ఏడ్చేవాళ్ళనికూడా నవ్వించేగల శక్తి ఉంది అతని మాటల తీరులో. కాలక్షేపాని కతనిలో కావలసినంత కవిత్వం ఉంది.

సీతాపతి మాతోకూడా స్టేషనుకు వచ్చాడు. గుంటూరు బండి నాలుగున్నరకి బయలుదేరింది. మేముబండి ఎక్కగానే సీతాపతి నాతో చెప్పాడు "రేవతితో చెప్పండి పెండ్లినాటికి ఎలాగో వీలు చేసుకుని వస్తానని; తీరికలేక ఉత్తరం వ్రాయలేదన్నానని. ఆమెకు నన్ను మింగేటంత కోపంవచ్చి ఉంటుంది."

"నేను నీకు సెలవు దొరకటం కష్టమని నచ్చచెపుతాలేవోయి" అన్నాను.

అతడు నవ్వుతూ "ఆమెదగ్గర ఆ పాకులేం పనిరావులెండి. నాకెంత ఘాటుగా వ్రాసిందో తెలుసా—'నీ వుద్యోగం బాధ్యతలు అన్నీ నాకు తెలుసు. కానీ నీమీద నాకుండే అభిమానం చేత నిన్నిబ్బంది పెట్టక తప్పదు. నువ్వు రాకుండా ఉండ లేవు' అని. ఇంతపెద్ద బాణం విసిరాక రాక తప్పుతుందా మరి!" ఇంతలో రైలు కదిలింది.

సీతాపతి ఆఖరున చెప్పిన మాటలు నాలో సుడులు తిరుగుతున్నాయి. 'నీమీద నాకుండే అభిమానంచేత నిన్నిబ్బంది పెట్టక తప్పదు' అని వ్రాసిందట.

బాగుంది. ఆమెకు సీతాపతిమీద అభిమానం! నా కామెమీద దయ! కృష్ణమూర్తి కామెమీద ప్రేమ! ఆమెను గూర్చి ఒక కొత్తవిషయం తెలిసినట్టు తృప్తిపడింది మనస్సు.

గుంటూరు చేరేసరికి రాత్రి ఏడు గంటలయింది. ఈ మధ్యలో నేనూ కృష్ణమూర్తి ఎక్కువ మాట్లాడుకోలేదు. స్టేషను బయటికి వచ్చాక "ఈ రాత్రికి వాళ్ళింటికి వెళ్ళదల్చుకోలేదు ఏదో హోటల్లో బస చేసి రేపుదయమే వెళతాను" అన్నాను.

కృష్ణమూర్తి కొంచెం సేపాలోచించి "నేనూ అంతే చేస్తాను. మా బంధువులున్నారు దగ్గరలోనే అక్కడికి వెళతాను ప్రస్తుతం. మీరెక్కడ బస చేస్తారో చెప్పండి. పొద్దుటేవచ్చి మిమ్మల్ని కలుసుకుంటూను ఇద్దరంకలసి వెళదాం" అన్నాడు.

"సరే" అన్నాను. ఇద్దరం మర్నాడు ఉదయం ఎనిమిదికి కలుసుకోవటానికి నిశ్చయించుకున్నాము.

మరునాటి ఉదయం తొమ్మిది గంటలయినా కృష్ణమూర్తి రాలేదు. చివరికి విసుగుపుట్టి రూముకు తాళంవేసి బయలుదేరాను. రేవతి యింటినంబరూ ఎడ్రస్సూ యిదివరకే తెలుసు. ఎక్కువ కష్టంలేకుండానే వాళ్ళిల్లు చేరుకోగలిగాను. పెద్దయిల్లు. చుట్టూ తోట. వీధి అవరణలో పనివాళ్ళు పందిరికి ఏవో అలంకరణలు చేస్తున్నారు. ఆవేళ బుధవారం పెండ్లి శుక్రవారం ఉదయం.

గేటులోపలికి వెళ్ళి ఇంట్లోకి కబురు చేశాను- పరుగెత్తుకొని వచ్చింది రేవతి. 'నమస్కారం మాస్టారూ' అన్నది. 'మాస్టారూ' అనే సంబోధన వెగటుగా తోచింది నాకు. తెచ్చి పెట్టుకుని ఒక చిన్న నవ్వు నవ్వాను.

"రండి లోపలికి; సామానేం లేదా!" అన్నది.

"సామాను వేరేచోట ఉందిలే" అంటూ ఆమె ననుసరించాను. లోపలికి తీసుకుని వెళ్ళి తన డ్రాయింగు రూములో కూర్చోబెట్టింది. బయట గదులలో చాలామంది మనుష్యులు బంధువులు కాబోలు యిటూ అటూ తిరుగుతున్నారు. ఆ గదిలో మాత్రం యింకెవ్వరూ లేరు. ముందు కాఫీ తెచ్చి యిచ్చింది.

"నా ఉత్తరం అందగానే బయలుదేరినట్లున్నారే! బెడ్డింగు హోటలులో పెట్టి వచ్చారా? ఇక్కడికి వస్తూ హోటలులో అగటం ఎందుకు?" ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేస్తూంది.

"నిన్న రాత్రే వచ్చాను. పొద్దుపోయి రావటం చేత సరాసరి ఇక్కడకు రావటం యిష్టంలేక హోటలులో బస చేశాను." కృష్ణమూర్తి సంగతి నేను చెప్పలేదు. నా కామె విషయం తెలుసుకోవాలని ఆదుర్దా ఎక్కువయింది. మళ్ళా ఎవరైనా వస్తారేమో ఈమాత్రం మాట్లాడే అవకాశం దొరకకపోవచ్చు.

"నేనింత ముందుగా బయలుదేరి రావటానికి కారణం నువ్వు వూహించగలవు. అసలు ఇంత హఠాత్తుగా ఈ నిశ్చయానికి కారణం యేమిటి? నీవు నిజంగా ఇష్టపడే ఈ నిశ్చయానికి వచ్చేవా? లేక పరిస్థితులేవైనా నిన్ను బలవంతంగా ఈ నిశ్చయానికి తీసుకువచ్చాయా? నేకిలా ప్రశ్నిస్తున్నందుకు మరొకలా భావించకు. నీయందు నాకు వుండే చనువుచేత——" మధ్యలోనే ఆమె అందుకుంది, "నాకు తెలుసును శాస్త్రిగారూ మిమ్మల్నీ ప్రశ్నలన్నీ కలవరపెడతాయని! మీ రడగటంలో తప్పేమీ లేదు. మీరు బాధపడతారేమోనని కూడా భయపడ్డాను. కాని బుద్ధిపూర్వకంగా మిమ్మల్ని బాధపెట్టా లనుకోలేదు. నా వివాహం నా యిష్టంమీదనే నిశ్చయమైనది." అన్నది. కాని ఆ అనటం కొంచెం కటువుగా ఉన్నది.

"నువ్వు నిజంగా యిష్టపడితే నే నింకేమీ బాధపడను. కాని వివాహం అనేది జీవితానికి సంబంధించినది. బాగా ఆలోచించావా? నువ్వు బాధపడటం నేను సహించలేను!"

"బాధపడటం సుఖపడటం అనేవి మన చేతిలో ఉన్న విషయాలు చాలావరకూ. మనస్సును సమాధాన పరచుకోవడంలో ఉంటుంది. అంతే!"

"నీకు కాబోయే భర్త అతను నీ కిదివరకు తెలుసునా?" అన్నాను కుతూహలం చంపుకోలేక.

"అసలు పరిచయం లేదు. వ్రాశాను కదూ—హఠాత్తుగా నిశ్చయమైనదని."

"ఇప్పు డడుగవలసిన ప్రశ్న కాదేమోలే! కాని మరొకపు డీమాత్రం అవకాశంకూడా ఉండదేమోనని సందేహనివృత్తికోసం అడుగుతున్నాను. ఏమీ పరిచయంలేని ఒక వ్యక్తితో జీవితం ప్రారంభించేకంటే అదివరకే అర్థంచేసికొన్న వ్యక్తితో జీవితం సుఖవంతంగా ఉండదంటావా? అటువంటి అవకాశం లేనివాళ్ళ సంగతి వేరు. కాని అవకాశం ఉండీ కూడా నీ విలాంటినిశ్చయాని కెందుకొచ్చావు?"

"నేనుకూడా ఈ విషయమై చాలా కాలం ఆలోచించాను. ప్రేమించి పెండ్లి చేసుకోవడం అనే దానిని అర్థం చేసికోవటానికి ప్రయత్నించాను. కాని చివరకు నాకు తోచినదేమిటంటే 'ప్రేమ' అనేది ఒక్కరి సొత్తుగా ఒక్కచోట నిల్చిపోయేది కాదనీ, ఎత్తునున్న నీరు పల్లానికి ప్రవహించటం ఎంత సహజమో ఇష్టం కలిగిన ప్రతి వ్యక్తి యందూ ప్రేమ ప్రసరించటం అంత సహజమని. ప్రేమించిన ప్రతివ్యక్తినీ వివాహం చేసుకోలేము. కాని వివాహం చేసికొనిన వ్యక్తిని ప్రేమించటం అంత కష్టం కాదనుకుంటాను. అంతేకాదు. ప్రేమించి వివాహం చేసుకోవటంలో చాలా యిబ్బందులున్నాయి."


"అయితే ప్రేమ అనేది నిలుకడలేని నీటివంటిదనా నీ ఉద్దేశ్యం" అన్నాను కొంచెం బాధగా.

"నిలుకడలేని నీటివంటిదని చులకన చేయటం లేదు నేను. అనువైన ప్రతి హృదయంలోకి ప్రవహించగల శక్తివంతమైన సజీవమైన ప్రవాహమంటాను. దానిని మనకు కావలసినచోట ఆనకట్ట వేసి నిలుపుకోవడానికి ఎంతో నిగ్రహం కావాలి. చాలా ప్రయాస పడవలసి ఉంటుంది. ఆ ప్రవాహంలో పడి కొట్టుకు పోయే కంటే ఒడ్డున కూర్చుని ఆనందించటం తేలికైన పని కాదూ?"

నా కామె మాటలకు ఉడుకుమోతుతనం వచ్చింది. "అయితే నేనిన్నాళ్ళు నీ విషయంలో చాలా పొరబడ్డానన్నమాట. నువ్వు కేవలం ఒడ్డున కూర్చుని ఆనందించే దానివని తెలుసుకోలేక పోయాను" అన్నాను కసిగా.

"మీరొక్కరే కాదు. నేనుకూడా అటువంటి పొరబాట్లు చేశాకనే ఈ సిద్ధాంతాని కొచ్చాను. మీరు నా ఆంతర్యం తెలియక బాధపడుతున్నారు కనుక చెపుతున్నాను. నిజానికి సీతాపతి మీ అందరికంటె నాకు ముందు పరిచయమైనాడు. అతడు తనకి పెళ్ళయిపోయిందని నాతో చెప్ప


ఇండియన్ బ్యాంక్, లిమిటెడ్

(స్థాపితం  1907)

హెడ్ ఆఫీసు: ఇండియన్ బ్యాంక్ బిల్డింగ్స్', నార్తు బీచ్‌రోడ్డు, మద్రాసు—1

దక్షిణ ఇండియా యందంతటనూ, బొంబాయి, కలకత్తా, న్యూఢిల్లీలోనూ బ్రాంచీలు, సబ్‌ఆఫీసులు గలవు.

మూలధనము

| | | | |
|---|---|---|---|
| అనుమతి పొందినది | ... | రు. | 1,00,00,000 |
| చందా వేసినది | ... | రు. | 72,00,000 |
| చెల్లించినది | ... | రు. | 60,20,000 |
| రిజర్వు & ఇతర ఫండ్సు | ... | రు. | 77,50,000 |
| డిపాజిట్లు (31-12-55) | ... | రు. | 29.44 కోట్లు |

అన్ని రకములైన బ్యాంకింగు వ్యాపారములు జరుపబడును.

యన్. గోపాల అయ్యర్, సెక్రటరీ.

కుండా కొన్నాళ్ళు దాగుడుమూతలాడేను. బుద్ధి పూర్వకంగా కాదనుకోండి. ఆ దినాల్లో అతడు నన్ను చాలా ఆకర్షించాడు. నేనతన్ని వివాహం చేసుకోవాలని గట్టి నిశ్చయం చేసుకున్నాను. అతడు వివాహితుడని తెలియగానే నా ఆశలు అడియాసలైనాయి. ఒకరకంగా నా మనస్సు దెబ్బతిన్నది."

ఈ మాట లంటూంటే రేవతి ముఖంలో సరిగ్గా ఆనాడు సీతాపతితో మాట్లాడుతున్నప్పుడు కలిగిన లక్షణాలే కన్పించినవి. ఆ మార్పులోని ఉద్వేగం నా కిప్పుడర్థమైంది. ఆమె చెప్పుకుపోతూంది:

"తరువాత మిమ్మల్ని గాఢంగా గౌరవించాను. అభిమానించాను. ఒక్కొక్కప్పుడు నాకు తెలియకుండానే నాలో ఏవో కోరికలు కలుగుతున్నా వీటన్నిటినీ అణచివేసే గుణమొక్కటి నన్ను హెచ్చరించేది. అది మీయందు నాకుగల గురుభావము. మొదట మీరు నాకు గురువుగా పరిచయమైనారు. ఆ భావమే అన్నిటినీ అధిగమించినది. ఇక కృష్ణమూర్తి విషయమూ, అతను వెన్నవంటివాడు. అతనితో జీవితం బాగానే గడుస్తుంది. కాని అతని హృదయానికి గట్టితనం లేదు. అతనియందు నాకు పసిపిల్లవానియందు కలిగే లాంటి ప్రేమ ఉంది."

ఇంతలో ఎవరో వచ్చి 'మీకోసం ఎవరో వచ్చారు' అన్నారామెతో.

నేను 'కృష్ణమూర్తి అయివుంటాడు. అతడు కూడా నిన్న నాతోనే వచ్చాడు' అన్నాను.

"అరే చెప్పనేలేదే' అంటూ బయటికి పరుగెత్తింది.

కృష్ణమూర్తి సీతాపతితో కలిసి వచ్చాడు.

"ఇదేమిటి నిన్న నేగా రానన్నావు ఎలా ఊడిపడ్డావోయి!" అన్నాను.

"మీరిద్దరూ రావడం చూచాక మనస్సుండబట్ట లేదు. ఎలాగో మా మేనేజరుతో నచ్చచెప్పి మూడు అబద్ధాలు నాలుగు నిజాలుచెప్పి మొత్తం మీద వచ్చేశాను" అన్నాడు నవ్వుతూ.

"ఇప్పుడే వస్తానుండండి" అని లోపలికి వెళ్ళి కాస్సేపటిలో ముగ్గురుకీ కాఫీ టిఫిను తెచ్చి యిచ్చింది.

'నావంతు అయిందిగా' అన్నాను నేను వద్దన్నట్లు ప్లేటు దూరంగా ఉంచుతూ.

'మీరు గురువుగారూ కదూ-డబుల్ షేర్ మీకు' అన్నది రేవతి మళ్ళీ ప్లేటును నా ముందరకు నెడుతూ. టిఫిన్ తింటూండగా కృష్ణమూర్తి చెప్పాడు. అతడు నా కొరకు లాడ్జికి వస్తుంటే సీతాపతి కన్పించాడట. ఇద్దరూ హోటలుకు పోయి వచ్చారట. అందుచేత ఆలశ్యమైందిట. కాఫీ తాగటం ముగించి జేబులోంచి సిగరెట్టుతీసి ముట్టించాను.

"మీరింకా ఈ అలవాటు మానలేదన్నమాట" అన్నది రేవతి కొంటెగా నా వంకచూసి.

"ఒకప్పుడీ అలవాటును మానవలసి వస్తుందేమోనని భయపడ్డాను. ఇప్పుడా భయం తీరిపోయింది కనుక నిర్భయంగా కాలుస్తాను" అన్నాను గట్టిగా దమ్ముపీల్చి పొగవదులుతూ ఒకవిధమైన గర్వంతో.

"నాకు కూడా కాస్తోకూస్తో అలవాటుంది. ఆడవాళ్ళ ముందు కాల్చటం మర్యాదకు భంగమని రేవతి మునుపెప్పుడూ కాల్చలేదు. గురువుగారే ప్రారంభించారు కనుక ఫరవాలేదు. ఆ డబ్బా యిటు పారేయండి మాస్టారూ!" అన్నాడు సీతాపతి.

కృష్ణమూర్తి యింకా తేరుకోలేదు. మౌనంగా అదోలా కూర్చున్నాడు. సీతాపతి అతనిపై ఒక చిరునవ్వు విసిరి—

"బరువైన విషయాలను కూడా తేలికగా ఊది పారేయటానికి సిగరెట్టొక్కటేనోయ్ సాధనం. చూస్తావెందుకు కాల్చిపారేయి నువ్వు కూడా!" అన్నాడొక సిగరెట్టు కృష్ణమూర్తి మీదకు గిరవాటేసి.

మాట్లాడకుండానే అందుకుని ముట్టించాడు కృష్ణమూర్తి. మూడు సిగరెట్ల పొగలతో గదంతా గుమ్ముకున్నది.

రేవతి "అబ్బ! ముగ్గురూ ఒక్కలాంటి వాళ్ళే తయారై-నన్ను-క్కిరి బిక్కిరి చేస్తున్నారు మీరంతా కలసి!" అన్నది ముఖంమీదకు కమ్ముకున్న సిగరెట్టు పొగలను చేతులలో పక్కలకు నెట్టుతూ.

సీతాపతి పెద్దనవ్వు నవ్వి "మా దేముంది లెద్దూ! వచ్చే బావగారు ఉక్కిరి బిక్కిరి చేయకుండా చూసుకో!" అన్నాడు.

నవ్వని కృష్ణమూర్తి కూడా నవ్వేశాడు. గదంతా నవ్వులతో ప్రతిధ్వనించింది. ★